పౌర హక్కులకై ఉద్యమించండి !　　　　　పౌర హక్కుల ఉద్యమాన్ని బలపరచండి ! !

# ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం (A.P.C.L.C.)

# 6 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి !

ప్రజలారా !

మే నెల 14 వ తేదీ (ఆదివారం) ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం తన 6 వ రాష్ట్ర మహాసభలను జరుపుకొంటున్నది. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం 15 సంవత్సరాలుగా రాష్ట్రంలో పనిచేస్తూ వుంది. అరెస్టులను, గూండా దాడులను, తప్పుడు కేసులను, హత్యలను అధిగమించి ఎదుగుతూ వుంది. దుష్ప్రచారాన్ని అధిగమించి ప్రజల అభిమానాన్ని పొందింది.

రాజకీయ కార్యకర్తలను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపినా, ప్రజా ఉద్యమాలపైన నిషేధాలను, నిర్బంధాన్ని ప్రయోగించినా, గ్రామాలలో పోలీసు క్యాంపులు పెట్టి పేద ప్రజానీకాన్ని చిత్రహింసలకు గురిచేసినా, ఇళ్ళు కూల్చేసినా, కాల్చేసినా ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం నిరసన తెలిపింది. పత్రికల ద్వారా, కరపత్రాల ద్వారా, బహిరంగ సభల ద్వారా ప్రచారం చేసింది. కోర్టులలో కేసులు వేసింది.

సామాన్య నేరాలలో ముద్దాయిలైనవారిని పోలీసు లాకప్పులలో చిత్రహింసలు పెట్టి "లాకప్పు మరణాలు" చేసి, ముద్దాయి తానే వురి వేసుకొని చనిపోయాడనో, విషం తిని మరణించాడనో, అకస్మాత్తుగా అనారోగ్యం వచ్చి పరమపదించాడనో పోలీసులు ప్రకటిస్తే, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం వాస్తవాలను వెలికితీసి ప్రజలకు తెలియచేసింది. విచారణలలో పాల్గొని నిజాలు నమోదయ్యేలాగ చూసింది. లాకప్పు మరణాలు నివారించడానికి అసంఖ్యాకంగా హెబియస్ కార్పస్ పిటిషన్‌లు వేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల హక్కులను హరించే నల్ల చట్టాలను తయారుచేసి అది సంఘ వ్యతిరేక శక్తుల కోసమేనని బుకాయిస్తే ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ఆ బుకాయింపును ఎండగట్టింది. కరపత్రాల ద్వారా, సభల ద్వారా, దినపత్రికలలో వ్యాసాల ద్వారా ఆ చట్టాల అసలు స్వభావమేమిటో ప్రజలకు తెలియపరచింది.

దళితుల మీద, స్త్రీలమీద బలవంతులైనవారు అత్యాచారాలుచేసి పోలీసుల సహాయంతో వాస్తవాలను కప్పిపెట్టేస్తే వాటిని వెలికితీసి పోలీసు యంత్రాంగంమీద వత్తిడి తేవడంతో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం దళిత ఉద్యమానికి, మహిళా ఉద్యమానికి తోడ్పడింది.

ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంవల్ల ప్రజలకు కరువు నుండి కాలుష్యం దాకా అనేక రూపాలలో వచ్చే సమస్యలను కూడా బహిర్గతం చేయడానికి, ప్రజలకు తమ హక్కులను గురించి హెచ్చరించడానికి, కోర్టులలో ఏమాత్రం న్యాయం సాధ్యమైతే ఆ మాత్రం సాధించడానికి ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం కృషి చేసింది.

మేము ఈ పనులు చేసినప్పుడల్లా అరాచకవాదులకు, అభివృద్ధి నిరోధకులకు, సంఘ వ్యతిరేక శక్తులకు, తీవ్రవాదులకు తోడ్పడుతున్నామని ప్రభుత్వ యంత్రాంగం దుష్ప్రచారం చేస్తోంది. ప్రభుత్వం తనను వ్యతిరేకించే వారికి తగిలించే ఈ బిరుదులను మేము ఆమోదించడంలేదు. కాగా, ఎవరుచేసే ఏ నేరాలను, ఏ రాజకీయ పంథాను మేము సమర్థించడంలేదు. మేము హింసను ప్రోత్సహించడంలేదు, సమర్థించడంలేదు. అయితే పౌరులు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ప్రభుత్వం వారితో చట్ట వ్యతిరేకంగా వ్యవహరించడాన్ని మేము సహించం. రాజ్యాంగం ఆదేశించే సమానత్వాన్ని ప్రజలకు సమకూర్చలేని ప్రభుత్వం, దాని సాధనకోసం ఉద్యమించే ప్రజలు, రాజకీయ శక్తులు ఆ క్రమంలో నేరాలకు పాల్పడితే వారితో ఆ రాజ్యాంగమే భరోసా ఇచ్చే ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే మేము చూస్తూ వూరుకోము. ప్రజలకు సుఖప్రదమైన జీవనాన్ని కల్పించలేని ప్రభుత్వం కనీసం వారి చట్టపరమైన హక్కులనైనా గౌరవించాలి. ఆ ప్రజలు ఎప్పుడూ చట్టబద్ధంగానే నడుచుకొంటారా ? అనేది ఇక్కడ అప్రస్తుతం. మాకు అనవసరం.

ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం దేశం మొత్తంమీద నడుస్తున్న ప్రజాతంత్ర ఉద్యమంలో భాగంగా పనిచేస్తూ వుంది. ప్రత్యేకించి దేశ వ్యాప్తమైన పౌర హక్కుల ఉద్యమంలో భాగంగా పనిచేస్తూ వుంది. ఒకవైపు అధికార యంత్రాంగం నుండి, బలవంతుల నుంచి ప్రజల మీద అణచివేత పెరుగుతుండగా మరియొకవైపు ప్రజాతంత్ర ఉద్యమం, పౌర హక్కుల ఉద్యమం బలపడుతూ వున్నాయి. ముఖ్యంగా పౌర హక్కుల చైతన్యం దేశంలో ప్రముఖంగా ముందుకు వస్తుంది. పౌర హక్కుల గురించి కొద్దిమంది మేధావులేగాక ప్రజానీకం విస్తృతంగా ఆలజడి చేస్తున్నారు. ఒకప్పుడు కొద్దిమందికే తెలిసిన పౌర హక్కులు అనే మాట ఇవ్వాళ జనంలో ప్రాచుర్యం పొందింది. రైతులు, కూలీలు, కార్మికులు, ఉద్యోగులు, స్త్రీలు, దళితులు, విద్యార్థులు, రాజకీయ కార్యకర్తలు తమ తమ సమస్యల పరిష్కారంకోసమో లేక రాజకీయ లక్ష్యాల సాధనకోసమో చేసే పోరాటాలేగాక తమకందరికీ సామాన్యంగా వర్తించే పౌర హక్కులకోసం ఆలజడి చేస్తున్నారు. పోలీసు అత్యాచారాలను రాజకీయ కార్యకర్తల సమస్యగానూ, ఎన్‌కౌంటర్లను నక్సలైట్ల సమస్యగాను, నిషేధాలను మేధావుల సమస్యగాను, నల్ల చట్టాలను, న్యాయవాదుల సమస్యగాను భావించే రోజులు పోయాయి. దళితులమీద, స్త్రీలమీద అత్యాచారాలు జరిగితే "ఇవి రోజు వుండేవే కదా !" అనుకొనే రోజులూ పోయాయి.

భారత రాజ్యాంగంలో ఏముందో తెలియనివాళ్ళు సైతం 59వ రాజ్యాంగ సవరణ గురించి ఆలజడి చెందారు. దేశ వ్యాప్తంగా కొన్ని లక్షలమంది జనం ఆ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా చెలరేగిన నిరసనలో ఏదో ఒక స్థాయిలో పాల్గొన్నారు. 59వ రాజ్యాంగ సవరణనేగాక దానికి మూలకందమైన "ఎమర్జెన్సీ" అధికారాలను వ్యతిరేకిస్తూ ఉద్యమించారు. పోస్టల్ బిల్లు గురించి, పరువునష్టం బిల్లును గురించి మన రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రెస్ బిల్లు, పోలీసు బిల్లుల గురించి జరిగిన ఆందోళనలు కూడా జనంలోకి పోగలిగాయి. హక్కులు ఒకరిచ్చినవి గావని, అవి మనం పోరాడి సాధించినవని, వాటిని తొలగించే చట్టాలను తయారుచేస్తే సహించి వూరుకోవడానికి వీలులేదని ప్రజలు గ్రహించారు. హక్కులను తొలగించే అధికారం రాజ్యాంగంలోనే వుంటే ఆ రాజ్యాంగాన్నే సవరించాలని డిమాండు చేస్తున్నారు. తమ అధికారానికి అడ్డమొచ్చినప్పుడల్లా ప్రజల హక్కులను తొలగించే చట్టాలను అలవోకగా జారీ చేయడం అలవరచుకున్న పాలకుల గొంతులో పచ్చి వెలక్కాయ పడిన మాట వాస్తవం. మన రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ బిల్లును, ప్రెస్ బిల్లును ఉపసంహరించుకోవలసి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ బిల్లును వాయిదావేసి, పరువునష్టం బిల్లును వెనక్కు తీసుకోవలసి వచ్చింది. అయితే ఈ విజయాలు సర్వత్రా సాధ్యంకావడంలేదు. కార్మికులకు సమ్మె హక్కు లేకుండాచేసే కార్మిక సంఘాల బిల్లు, ఉద్యోగులకు సంఘటితపడే ఆ హక్కు లేకుండాచేసే ఆసుపత్రులు యితర సంస్థల బిల్లు ఎంత నిరసన తెలిపినా పార్లమెంటు ముందు కొనసాగుతూనే వున్నాయి. ఇంతకంటే ప్రమాదకరమైన కొన్ని చట్టాలు శాసనంలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాయి. అనుమానంతోనే మనుషుల్ని కాల్చి చంపే కల్లోలిత ప్రాంత చట్టం, నేరారోపణగానీ, విచారణగానీ లేకుండా ఏ వ్యక్తినైనా ఒక సంవత్సరం లోపు జైలులో పెట్టగల జాతీయ భద్రతా చట్టం (NSA), ఏ సమ్మెనైనా నిషేధించి నాయకత్వాన్ని నిర్బంధించగల అత్యవసర సర్వీసుల నిర్వాహణ చట్టం (ESMA), రాజకీయ నేరాలలో ముద్దాయిలకు కనీస హక్కులుగానీ, సహజ న్యాయ సూత్రాలుగానీ వర్తించకుండాచేసే టెర్రరిస్టు చట్టం ఈ కోవకు చెందినవి. అధికార యంత్రాంగం అంబులపొదిలో ఇటువంటి విషపూరిత అస్త్రాలు చాలా ఉన్నాయి. రోజు రోజుకూ పెరుగుతూ పోతున్నాయి.

నల్ల చట్టాల విషయాలలోనేగాక అన్ని విషయాలలోనూ ఒకవైపు పౌర హక్కుల చైతన్యం పెరుగుతుండగా, మరొకవైపు అణచివేత కూడా పెరుగుతూ వుండడం పోలీసు అత్యాచారాల గురించి మాట్లాడితే 'పోలీసులు కొట్టక ఏంచేస్తారు?' అని అమాయకంగా అడిగే రోజులు పోయాయి. పోలీసులకు తుపాకులిచ్చింది కాల్చడం కోసమేననే రోజులు పోయాయి. అరెస్టు చేసిన వారిని 24 గంటలలో కోర్టులో హాజరుపరచాలని, లాకప్‌లో చిత్రహింసలకు గురిచేయకూడదని, సాక్షులు లేకుండా పోలీసులు ఎవరి ఇల్లు సోదా చేయడానికి వీలులేదని, ఎంతటి నేరానికైనా శిక్ష వేయవలసింది కోర్టులే తప్ప పోలీసులు కారని ఇవ్వాళ జన సామాన్యానికి సైతం తెలిసింది. లాకప్ మరణాలను జనం ఇవ్వాళ లాకప్ హత్యలుగా గుర్తిస్తున్నారు. వాటికి వ్యతిరేకంగా ఆలజడి చేస్తున్నారు. అడపా దడపా కోపోద్రిక్తంలో పోలీస్ స్టేషన్‌ల మీద దాడి చేస్తున్నారు. ఎన్‌కౌంటర్లన్నీ బూటకమని జనం ఇవ్వాళ గుర్తిస్తున్నారు. అటువైపు ప్రభుత్వం ఆలజడిని చల్లార్చే ప్రయత్నంలో అప్పుడప్పుడు న్యాయ విచారణను ప్రకటిస్తున్నా, ఆ న్యాయ విచారణ నివేదికలను బుట్టదాఖలుచేసి, పోలీసులకు మరిన్ని విచ్చలవిడి అధికారాలిస్తున్నది. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా 20 నుండి 30 దాకా లాకప్ మరణాలు జరుగుతున్నాయి. ఎన్‌కౌంటర్లు కూడా ఎప్పటి మోతాదులోనే సాగుతున్నాయి. కాంగ్రెస్ పాలనలో (1969 నుండి 1983 వరకు) దాదాపు 465 మంది నక్సలైట్ పార్టీల కార్యకర్తలను, సానుభూతిపరులను, విద్యార్థి, రైతాంగ ఉద్యమకారులను ఎన్‌కౌంటర్లలో చంపగా, తెలుగుదేశం పాలనలో ఇప్పటికి 168 మందిని చంపారు. దళితుల మీద, స్త్రీల మీద జరిగే అత్యాచారాలను ప్రకృతి వైపరీత్యాలంత సహజమైన విషయాలుగా భావించే రోజులు పోయినా, ప్రతిఘటనా చైతన్యం పెరిగినా అత్యాచారాలు సాగుతూనే ఉన్నాయి. కారంచేడు, నీరుకొండ, దొంతలి, గుడియాడ, బండ్లపల్లి, కొల్లిపర, టంగుటూరు ఈ నాలుగేళ్ళలో పేరుగాంచిన ఊళ్ళే. ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా ఎంత చైతన్యం పెల్లుబికిందో ప్రభుత్వం నుండి అంత తక్కువ న్యాయం జరిగింది. ఏ ఒక్క కేసులోనూ ఇప్పటివరకు ముద్దాయిల విచారణ సహితం ప్రారంభం కాలేదు. ఇక వరకట్నం హత్యల సంగతి, స్త్రీలపై జరిగే లైంగిక అత్యాచారాల సంగతి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత పరువు మిగులుతుంది.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం తన ఆరవ రాష్ట్ర మహాసభలను జరుపుకుంటోంది. రాష్ట్రం నలుమూలల నుండీ ప్రతినిధులు హాజరై భవిష్యత్తు కర్తవ్యాలను చర్చించుకుంటారు. ఇతర రాష్ట్రాల పౌర హక్కుల సంఘాల ప్రతినిధులూ, పౌర హక్కులకోసం కృషిచేస్తున్న ప్రముఖులు ప్రసంగిస్తారు. ఈ సభలను జయప్రదం చేయవలసిందిగా ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

## కార్యక్రమము

ప్రారంభ సభ : మే **14** ఉదయం గం. **10-30** ని॥లకు నెల్లూరు పట్టణంలోని కస్తుర్బా కళాక్షేత్రంలో జస్టిస్ వి.ఎం. తార్కుండే ప్రసంగిస్తారు.

ఊరేగింపు : సాయంత్రం **5** గంటలకు

బహిరంగ సభ : సాయంత్రం గం. **6-30** ని॥లకు సర్వోదయ కళాశాల ఆవరణలో శ్రీ జార్జి ఫెర్నాండెజ్, కన్నబిరాన్, తారకం, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు ప్రసంగిస్తారు.

బహిరంగ సభ అనంతరం ఒంగోలు అభ్యుదయ కళా సమితివారి 'లాకప్' నాటక ప్రదర్శన ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (A.P.C.L.C)